క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధురాలికి సరుకులు అందజేస్తున్న శివరామాంజనేయ సంఘం సభ్యులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటి వలస గ్రామానికి చెందిన రెండు కుటుంబాలను అదే గ్రామానికి చెందిన శివరామాంజనేయ యువజన సంఘం దత్తత తీసుకుంది. ఈకుటుంబాలకు ఆ సంఘ సభ్యులు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇంటి పెద్దను కోల్పోయిన కళావతి, తవిటమ్మకు నెలకు సరిపడా సరుకులు అందజేశారు. యువజన సంఘం సభ్యులు రెడ్డి శ్రీనివాసరావు, బెజ్జిపురపు కృష్ణమూర్తి, గాడెపల్లి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

వంగర: కొప్పరవలస గ్రామంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దామన్నారు. అనంతరం మండలంలో రూ.80 లక్షలతో వివిధ బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మాజీ ఎంపీపీలు బొత్స వాసుదేవ రావునాయుడు, పైల వెంకటరమణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జేసీ రాజు దంపతులకు సన్మానం



జేసీ రాజు దంపతులను సత్కరిస్తున్న పట్టణ ప్రముఖులు

బొబ్బిలి: ఇటీవల విజయవాడలో ఎన్టీఆర్ పురస్కారాన్ని అందుకున్న రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు దంపతులను స్థానిక కళింగ వైశ్య భవనంలో ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ బొబ్బిలి అధ్యక్షుడు శ్రీనివాసన్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు జేసీ రాజుసేవలను కొనియాడారు. పట్టణ ప్రముఖులు గెంబలి శ్రీనివాసరావు, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు, మాజీ సర్పంచ్ తాడు, తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన కార్తీక్



మరడాన కార్తీక్

బొబ్బిలి: మండలంలోని చింతాడకు చెందిన మరడాన విశ్వేశ్వర రావు, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు కార్తీక్ నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 391వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 102 ర్యాంకు సాధించారు. 720కి 622 మార్కులు వచ్చాయి. కార్తీక్‌ను స్థానికులు అభినందిస్తున్నారు.



బొత్స యామిని

సత్తాచాటిన యామిని

రేగిడి: మండల పరిధిలోని కొమెర గ్రామానికి చెందిన బొత్స యామిని నీట్ ఫలితాల్లో సత్తా చాటారు. ఆలిండియా స్థాయిలో 11,594వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 4,928వ ర్యాంకు సాధించింది.720కిగా 551 మార్కులు వచ్చాయి. ఈమె తల్లిదండ్రులు బొత్స సుదర్శనరావు న్యాయవాద వృత్తిలో ఉండగా తల్లి పార్వతి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు.

నవధాన్యాలతో నేలసారవంతం



బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తున్న వెంకటరమణ

సంతకవిటి: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ అన్నారు. గుళ్లసీతారాంపురం గ్రామంలో రైతు కంబాల దాలప్పడుకు చెందిన పొలంలో ఆదివారం నవధాన్యాలు చల్లించారు. అంతకు ముందు బీజామృతంతో విత్తన శుద్ధి చేశారు. నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. రైతులు అంతా పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు.

మాగోడు పట్టదా..?

- తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు
- 40 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- హామీ ఇచ్చి ముఖం చాటేసిన ఉపముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్



మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: స్థానిక మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గత నెల 7వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు. 40 రోజులుగా వీరు సమ్మె చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం తమకు పనికి తగ్గ వేతనం ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నా రు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఎలాంటి స్పందన రావ డం లేదని కార్మికులు అంటున్నారు. రాజాం మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో 42 మంది టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరంతా విద్యుత్, తాగునీరు సరఫరా, తాగునీ టి పథకాల నిర్వ హణ తదితర పనులు చేస్తుంటారు. వీరికి నెలకు రూ.13 వేలు వేతనం ఇస్తున్నారు. చాలీచాలని వేత నాలతో కుటుంబ పోషణ కష్టంగా మారుతోందని, ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయా లు కూడా లేవని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. గతంలో వారాహి యాత్రకు వచ్చిన పవన్ కల్యాణ్‌కు, యువగళంలో నారా లోకేష్‌కు తమ సమ స్యలు విన్నవించగా, అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు కనీసం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

కార్మికుల డిమాండ్లు ఇవే....

- కార్మిక చట్టాల ప్రకారం ఇంజినీరింగ్ వర్కర్లకు రూ. 29,200, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ. 24,500 చొప్పున జీతాలు చెల్లించాలి.
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతోపాటు, 15 ఏళ్ల సర్వీసు ఉన్న కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి.
- ప్రభుత్వం ప్రకటించిన 55 ఆదివారాలు, 17 దేశ, జాతీయ, రాష్ట్ర పండగ రోజుల్లో సెలవు ఇవ్వాలి. లేదా ఆ రోజులకు వేతనాలు అయినా ప్రకటించాలి.
- విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10లక్షలు, అంగవైకల్యం చెందిన వారికి రూ. 5 లక్షలు నష్ట పరిహారంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- సీనియార్టీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలి.
- విధుల్లో ఉంటుండగా అనారోగ్యం బారిన పడి శరీరం సహకరించని వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ మే వైద్యసేవ లందించాలి. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- కార్మికులకు సంక్షేమ పథకాలు, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలి.
- పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రాట్యుటీతో పాటు కనీసం రూ.10వేలు పింఛన్ ఇవ్వాలి. లేదా పదవీ విరమణ చేసిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

శ్రమ దోపిడీకి గురవుతున్నాం...



మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ సిబ్బంది శ్రమదోపిడీకి గురవతున్నారు. అన్ని అత్యవసర విభాగాల్లోనూ సేవలందిస్తున్నాం. పనికితగ్గ వేతనం అందించడం లేదు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదు. – లావేటి హరిబాబు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు, రాజాం

హామీ నెరవేర్చాలి...



గత 40 రోజులుగా ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరం. వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్ తమకు స్పష్టమైన హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక మరచిపోయారు. తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇచ్చిన హామీ నెరవేర్చి తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తాం. – యజ్జల అనిల్‌కుమార్, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు

16న మహాధర్నా

రాజాం సిటీ: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల పెంపుతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16న విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు సీహెచ్.రామ్మూర్తి నాయుడు కోరారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఏడు సంవత్సరాలుగా ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచలేదని, సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. 40 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకుండా చర్చ ల పేరిట కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించాల్సిన పరిస్థితి ప్రభుత్వమే తీసుకువచ్చిందని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షులు హరిబాబు, అనిల్, నర్సింగరావు, శారద, గణపతి, సోమేష్, కృష్ణ, మరియదాసు, శ్రీను, రాజు, ప్రసన్న, లక్ష్మి, ఆశాలత పాల్గొన్నారు.

సర్పంచ్‌లు కోటీశ్వరులు అనుకుంటున్నారా చంద్రబాబూ..?

- జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు



మాట్లాడుతున్న జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంబాబు,తదితరులు

రామభద్రపురం: గ్రామ సర్పంచ్‌ల పిల్లలను 'తల్లికి వందనం' పథకానికి అనర్హుల జాబితాలో చేర్చారని, సర్పంచ్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోటీశ్వరులు అనుకుంటున్నారా, లేక ప్రభుత్వ ఉద్యోగులు అనుకుంటున్నారా అని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు మండిపడ్డారు. మండలకేంద్రంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, సర్పంచ్‌ల ప్రతినిధులతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.సర్పంచ్‌లు కేవలం రూ.3 వేల గౌరవ వేత నం పొందుతున్నార న్న కారణంతో వారి పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయకపోవడం మంచిది కాదన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉంటే అన్ని సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తు చేశారు. సమాజంలో గౌరవం కోసం తెల్ల దుస్తులు వేసుకున్నంత మాత్రాన సర్పంచ్‌లు చంద్ర బాబుకు లక్షాధికారులు, కోటీశ్వరులుగా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు వందలాది హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టి మోసగించడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేశానని, ఇంకా ఎవరైనా సూపర్ సిక్స్ గురించి మాట్లాడితే నాలుక మందం తప్ప ఇంకొకటి కాదని సీఎం చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉందన్నారు.ఇప్పుడు మాట లు మార్చుతూ, ఏవేవో నిబంధనలు పెడుతూ తల్లికి వందనం పథకం కట్ చేస్తున్న సీఎం చంద్రబాబుకే నాలుక మందంగా ఉందనిపిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో దుప్పలపూడి సర్పంచ్ వి.భాస్కరరావు,నాయుడువలస,పాతరేగ,మామిడివలస గ్రామాల సర్పంచ్‌ల ప్రతినిధులు నడిమింటి సత్యం నాయుడు,గొట్టాపు పైడిపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి సీఐ కె.నారాయణరావు అన్నారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో ఆదివారం రాత్రి ప్రజలు, యువకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కొత్త వాహన చట్టాలు,రోడ్డు ప్రమాదాలు,సైబర్ నేరాలు,మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని,మరికొందరికి అవగాహన కల్పించాలన్నారు. ఇప్పుడు ఇన్‌స్టాగామ్ యాప్ మోసాలు అధికమవుతున్నాయని, ఫేక్ యాప్‌లు ఓపెన్ చేయకూడదన్నారు.అలాగే కొరియర్ పేరుతో, చైల్డ్‌ఫోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు,లోన్ యాప్, హనీ ట్రాప్,లాటరీల పేరుతో,డిబెట్ కార్డు మోసాలు,వీడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయిలింగ్ తదితర నేరాలకు పాల్పడుతు న్నారన్నారు. స్మార్ట్ ఫోన్లను మంచి కోసం ఉపయోగించాలని, సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలను చూసి ఆకర్షణకులోనై మోసపోకూడదన్నారు.మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే కొత్త వాహన చట్టం ప్రకారం రూ.10 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

పద్మనాభంకు గోరక్షక్ వీర్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పద్మనాభం

బొబ్బిలి: బొబ్బిలి ఉప ఖజానాధికారి పి.వి.పద్మనాభంను రాష్ట్రీయ గోరక్షక్ వీర్ పురస్కారం వరించిం ది. ఢిల్లీకి చెందిన శ్రీదేవి కల్యాణ సేవా ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. గోవుల సంరక్షణ, కబేళా ల మూసివేత వంటి కార్యక్రమాలతో సుమారు 500 గోవులను సంరక్షించడం, మూడు గోవధశాలల మూసివేయించినందుకు పద్మనాభంను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈయన ప్రస్తుతం 2 గోశాలలు నిర్వహిస్తున్నారు. గోర్షక్ వీర్ పురస్కారం అందుకున్న పద్మనాభాన్ని స్థానికులు ఆదివారం అభినందించారు.

• ఘనంగా ఫాదర్స్‌డే



పెద్దలను సత్కరిస్తున్న స్నేహం అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వెంకటసూర్యదుర్గా కల్యాణ మండపంలో 'స్నేహం' అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఫాదర్స్‌డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పలు సంఘాలను ఆర్గనైజ్ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పట్టణానికి చెందిన అంబికా కోటేశ్వరరావు, బస్వా పంచముఖేశ్వరరావు, దాసరి అప్పా రావు, పెంకి గౌరీశ్వరరావు, కొల్లూరు సత్యనారాయణలను సత్కరించారు. స్నేహం అసోసియేషన్ కో-కన్వీనర్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ సన్మానగ్రహీతలు తండ్రి స్థానంలో ఉండి తమను సమాజసేవలో ముందుకు నడిపించడం గొప్పవిషయమని కొనియాడారు. కార్యక్రమంలో స్నేహం అసోసియేషన్ సభ్యులు బి.వి.అచ్యుత్‌కుమార్, కొల్ల పార్థసారధి, కొత్తా మధుసూదనరావు, పెంకి చైతన్యకుమార్, నీలకంఠేశ్వర యాదవ్, గట్టి పాపారావు, కొత్తా ప్రకాష్, చీమకుర్తి ప్రసాద్, ఉప్పల ప్రసాద్, చీమకుర్తి రంగ, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: జ్ఞాన సముపార్జనకు పుస్తకపఠనం ఎంతో దోహద పడుతుందని, విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం' చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం చేసే విధానంపై అవగాహన కల్పించడంతో పాటు ప్రయోజనాలను వివరించారు.పాఠ్య పుస్తకాలతోపాటు, నీతి కథల పుస్తకాలు, దేశ నాయకుల జీవిత చరిత్ర, ఇతిహాసాలు, శాస్త్ర, సాంకేతిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు చదవాలని సూచించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని విద్యార్థులను కోరారు.

కాలువల్లో చెత్త పారబోయవద్దు



కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిస్తున్న కార్మికులు

రాజాం: పట్టణంలోని కాలువలు, డ్రైనేజీ మదుముల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తపార బోయవ ద్దని మార్కెట్లలో వ్యాపారులకు మున్సిపల్ కార్యాలయ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. ప్రసాద్ సూచించారు. మాధవబజార్, శ్రీనివాస రోడ్డు, బొబ్బిలి జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆదివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని కాలువల్లో ప్లాస్టిక్ బాటిల్స్, సంచులను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఆయా ప్రాంతాల మహిళలకు పరిసరాల పరిశుభ్రత, హోం కంపోస్టు తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణపై అవగాహన కల్పించారు.వ్యాపారస్తులు ప్లాస్టిక్ సంచులు, ఖాళీ బాటిళ్లు విచ్చలవిడిగా కాలువల్లో వేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక రేపు

మెంటాడ: మండలంలోని ఇద్దనవలస గ్రామంలో ఈనెల 17న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ అనంతరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.ఇద్దనవలస విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై వినతులు అందజేయవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

మైసూరు దత్తపీఠంలో రేగిడి భజన బృందం



మైసూరులోని సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమం వద్ద రేగిడి దత్తపీఠం సభ్యులు

రేగిడి: మైసూరులోని గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో భజన గీతాలు ఆలపించేందుకు మండల కేంద్రానికి చెందిన భజన బృందం వెళ్లింది. రేగిడి గ్రామ దత్తపీఠం ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో ఏడాదికోసారి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమానికి వెళ్లి భజన గీతాలు ఆలపించడం ఆనవా యితీగా వస్తోందని భజన బృంద సభ్యులు తెలిపారు. గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఇటీవల మృతి చెందినప్పటికీ ఆయన చూపిన బాటలోనే ఈ ఏడాది కూడా వెళ్లామని రేగిడి దత్తపీఠం సభ్యులు తెలిపారు.

చినుకుపడితే చిత్తడే...



మజ్జిరాముడుపేట వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

రేగిడి: పాలకొండ -రాజాం రహదారిలో మండలంలోని మజ్జిరాముడుపేట, ఉంగరాడమెట్ట జంక్షన్‌ల వద్ద రోడ్డు అధ్వానంగా తయారైంది. ఏమాత్రం వర్షం కురిసినా ఇక్కడ రోడ్డంతా బురదమయమ వుతోంది. గత ప్రభుత్వ హయాంలో పాలకొండ నుంచి రాజాం వరకు తారురోడ్డును నిర్మించారు. మజ్జిరాముడుపేట, ఉంగరాడమెట్ట జంక్షన్‌ల వద్ద సిమెంట్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. తారు రోడ్డు పనులు పూర్తయ్యాక సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ ఎన్నికలు రావడంతో అప్ప టిలో పనులు నిలిచిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగులు పనులు చేయాలనే ఆలోచనే చేయడం లేదు. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఈ రెండు చోట్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆ మార్గంలో నిత్యం ప్రయాణించే వారు కోరుతున్నారు.

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం ఎందుకు..?

- ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు



సంకిలి వద్ద సాయన్నచానల్ షట్టర్లను పరిశీలిస్తున్న అప్పలనాయుడు, జనార్దనరావు

రేగిడి: సాగునీటి వనరుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం దారుణ మని, ప్రభుత్వానికి ఎందుకంత నిర్లక్ష్యమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ప్రశ్నించారు. మండలంలోని సంకిలి వద్ద ఉన్న సాయన్న చానల్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సాయన్నచానల్ పరిధిలో రేగిడి, సంతకవిటి మండలాలకు చెందిన సుమారు 11,600 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉందన్నారు. చానల్ ఆధునికీకరణ పనుల ను గత పదేళ్లుగా చేపట్టకపోవడంతో షట్టర్లు పూర్తిగా పాడయ్యాయని, ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరందడం కష్టసాధ్యమేనని పేర్కొన్నారు. తునివాడ చానల్, మద్దువలస, తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. రేగిడి మండలంలోని తోటపల్లి కాలువ కింద ఉన్న బాలకవివలస, మునకలవలస, కాగితాపల్లి, బూరాడ, లచ్చన్నవలస, తాటిపాడు, తోకలవలస తదితర గ్రామాల పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువల్లో పూడిక, తుప్పలు పేరుకుపోయాయని, ఇటీవల కొంతమంది రైతులు తమ సొంత నిధులతో సాయన్న చానల్‌కు షట్టర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. సాగునీటి కాలువలన్నింటికీ మరమ్మతులు చేపట్టాలని, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా జలవనరులు, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



బ్రహ్మ కుమారీస్ యోగాశ్రమంలో ఆసనాలు వేస్తున్న బ్రహ్మ కుమారీలు



వేణుగోపాల స్వామి ప్రవచన మండపంలో యోగా సాధన చేస్తున్న పట్టణవాసులు

బొబ్బిలి: యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుం దని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని బ్రహ్మకుమారీస్ జ్ఞాన శిక్షణ యోగాశ్రమం ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి అన్నారు. స్థానిక యోగ శిక్షణ కేంద్రంలో యోగ గురువుతో కలిసి అభ్యాసకులకు ఆదివారం శిక్షణ ఇచ్చారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయ ప్రవచన మండపంలో సీనియర్ సిటిజన్‌లు యోగా సాధన చేశారు.